ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.03.06.2026 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలో రెండు జాతీయ రహదారులను నాలుగు లేన్లకు విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.

2. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య సహకారాన్ని విస్తరించుకో నున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

3. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా రెండు అదనపు టీఈటీ పరీక్షలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

4. ఈరోజు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు , ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**కేబినెట్**

తెలంగాణలో రెండు జాతీయ రహదారులను నాలుగు లేన్లకు విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 190.76 కిలో మీటర్ల పొడవున 7 వేల 597 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా... నేషనల్ హైవే-63లోని ఆర్మూర్ నుండి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో అభివృద్ధి చేయనున్నారు. అలాగే నేషనల్ హైవే-563లోని జగిత్యాల నుండి కరీంనగర్ వరకు బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్ ఫర్ టోల్ పద్ధతిలో నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర తెలంగాణలోని ప్రధాన నగరాల మధ్య రవాణా సౌలభ్యం మెరుగుపడి , ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిచ్చే అవకాశం ఉంది.

డెస్క్

**భేటీ**

హైదరాబాద్‌లో ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో కీలక సమావేశం నిర్వహించారు. తెలంగాణ-దక్షిణాఫ్రికా సంబంధాలు మరింత బలపడే కోణంలో ఈ సమావేశం జరిగింది. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడుల రంగాల్లో ఇరు పక్షాల మధ్య సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ ఐటీ , ఫార్మా, రక్షణ రంగాల్లో ప్రపంచ స్థాయి నైపుణ్య కేంద్రంగా ఎదిగిందని , తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మెడికల్ టూరిజంలో కూడా హైదరాబాద్ ముందంజలో ఉందని తెలిపారు.

డెస్క్

**టెట్**

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా రెండు అదనపు టీఈటీ పరీక్షలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సంవత్సరానికి రెండు సాధారణ టీఈటీ పరీక్షలు మాత్రమే నిర్వహించేవారు. ఇప్పుడు అదనంగా మరో రెండు ప్రత్యేక పరీక్షలు నిర్వహించడానికి అనుమతి లభించింది.

డెస్క్

**దామోదర రాజనర్సింహ**

తెలంగాణను ప్రపంచ స్థాయి ఆరోగ్య , ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రులు శ్రీధర్ బాబు , దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా బొరపట్లలో థెరానిమ్ బయోలాజిక్స్ అత్యాధునిక బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించి న అనంతరం మంత్రులు మాట్లాడుతూ... ఆరోగ్య సంరక్షణ మందుల తయారీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా పనిచేస్తుందన్నారు.

క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధుల చికిత్సకు అవసరమైన బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుందన్నారు.

పిటిసి, సంగారెడ్డి

**మంత్రి వాకిటి శ్రీహరి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపటి మక్తల్ పర్యటన ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలు  స్తుందని పశుసంవర్ధక శాఖ  మంత్రి వాకిటి శ్రీహరి  అన్నారు. తెలంగాణ , కర్ణాటక సరిహద్దుల్లో కృష్ణా  , భీమా నదులపై ప్రతిపాదించిన బ్రిడ్జి కం బ్యారేజీల నిర్మాణంపై కర్ణాటక నీటిపారుదల మంత్రి బోసరాజుతో ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిగాయ  ని తెలిపారు. ఈ సదర్భంగా విలేకరులతో మాట్లాడుతూ...

**బైట్ ... మంత్రి వాకిటి శ్రీహరి**

**పిటిసి, మహబూబ్ నగర్**

**తుమ్మల నాగేశ్వరరావు**

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈరోజు ఖమ్మంలో మంత్రి మాట్లాడుతూ... వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు.

**పిటిసి, ఖమ్మం**

**చెక్కు**

రాష్ట్రంలోని NPDCL పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రమోద్ కుమార్ భార్య స్వప్నకు కోటి రూపాయల    విలువైన ప్రమాద బీమా చెక్కును ఉప  ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈరోజు ప్రజాభవన్‌లో అందజేశారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో NPDCL కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం , శాలరీ ఖాతాలు నిర్వహించే ఉద్యోగులకు కోటి రూపాయల వ్యక్తిగత ప్రమాద బీమా రక్షణ కల్పిస్తున్నారు.

డెస్క్

**శివసేనారెడ్డి**

ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలి , ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడా కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా–సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఈరోజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ శివప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

డెస్క్

**ఏలేటి**

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను పక్కనబెట్టి అబద్ధాలు , అతిశయోక్తులు, ప్రగల్భాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ప్రతి సందర్భంలోనూ కేంద్ర ప్రభుత్వాన్ని , బీజేపీని లక్ష్యంగా చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

డెస్క్

**కేటీఆర్**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పెట్టుబడుల సాధనలో బెంగళూరును అధిగమించినట్లు భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.తారకరామారావు తెలిపారు. ఈరోజు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమే తెలంగాణ ఇచ్చినప్పటికీ.. ఇవ్వక తప్పని పరిస్థితి సృష్టించింది కేసీఆర్‌యేనని వెల్లడించారు.

డెస్క్

**తురింగియా**

ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జర్మనీలోని తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మారియో వోయిట్ బృందం సమావేశమయ్యింది. టెక్నాలజీ , పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, ఫార్మా తదితర అంశాలపై పరస్పర సహకారం కోసం తెలంగాణ-తురింగియా రాష్ట్రాలు MOU కుదుర్చుకున్నాయి.

డెస్క్

**పీఈ సెట్**

కరీంనగర్ లోని శాత వాహన విశ్వ విద్యాలయల క్రీడా మైదానంలో వ్యాయామ విద్యా 2026 ప్రవేశ పరీక్షలు ముగిశాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీ పరీక్షల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

బైట్ ... ఉమేష్ కుమార్, ఉప కులపతి

పీటీసీ, కరీంనగర్

**వాతావరణం**

ఈరోజు, రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు , ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అలాగే , రేపు, ఎల్లుండి చాలా జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

పీఎస్

**ధాన్యం కొనుగోలు**

ధాన్యం కొనుగోలు , రవాణా ప్రక్రియ తుది దశ కి చేరుకున్న దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు.

పిటిసి, జనగామ

**సైకిల్ దినోత్సవం**

ఈరోజు ప్రపంచ సైకిల్ దినోత్సవం జరుపుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణ , ప్రజారోగ్యం, సుస్థిర రవాణా సాధనంగా సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి 2018లో అధికారికంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.

జీఎస్

**సైక్లింగ్**

ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం వల్ల శారీరక , మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని , రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీర రాందాస్ అన్నారు.

ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైకిల్ వల్ల ఇంధన ఆదాతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు.

పిటిసి, సిరిసిల్ల